క్లుప్తంగా

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు
● మున్సిపల్ కమిషనర్ సుష్మ

పరకాల : ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ లైసెన్స్‌లు, ఇంటి పన్నులు చెల్లించాలంటూ మున్సిపల్ అధికారుల పేరిటా వచ్చే ఫేక్ కాల్స్‌ను నమ్మొద్దని మున్సిపల్ కమిషనర్ కె.సుష్మా గురువారం ఒక ప్రకటనలో కోరారు. పరకాల పట్టణంలోని కొంత మంది వ్యాపారస్తులకు ఫేక్ ఫోన్ కాల్స్ వస్తున్నాయనే ఫిర్యాదులపై ఆమె స్పందించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో అవతారం ఎత్తి డబ్బులు కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వ్యాపారస్తుల, ఇళ్ల యాజమానులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కమిషనర్, మున్సిపల్ అధికారులు ఎవరూ ఫోన్ చేయరని స్పష్టం చేశారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ
ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలలో ఉచిత విద్యతో పాటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో నూతనంగా సైన్స్ గ్రూప్‌లు మంజూరయ్యాయని, విద్యార్థులు సైన్స్ గ్రూపుల్లో చేరి ఉచిత విద్యను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
● మాజీ సర్పంచ్‌ల డిమాండ్

ఆత్మకూరు : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మండలంలోని మాజీ సర్పంచ్‌లు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు సావురే కమల రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి చేసేందుకు అప్పులు తెచ్చి పనులు చేశామని తెలిపారు. కానీ గత, ప్రస్తుత ప్రభుత్వాలు బిల్లులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నరేష్, మనోహర్, యాదగిరి పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత
శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ముక్క సుదర్శన్ కిరాణం షాపు దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. వాటి విలువ రూ. 2,282 ఉటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీఏసీఎస్‌లో రూ. 3లక్షల అవినీతి
శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వానాకాలం సీజన్ ధాన్యం సేకరణలో అదనపు ఖర్చుల కింద రూ.3 లక్షల అవినీతి జరిగినట్లు జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి నిర్ధారించారు. ఈ మేరకు రికవరీకి ఆదేశిస్తూ సొసైటీ చైర్మన్ శరత్ బాబుకు నోటీలు జారీ చేశారు. సీనియర్ ఆడిటర్ మతిన్‌సుల్తాన్ ఆడిట్ నిర్వహించి అవినీతి జరిగినట్లు నివేదిక అప్పగించినట్లు తెలిపారు.

5న ఉపాధి మేళా
కమలాపూర్ : దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈనెల 5న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర వాటిపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం ప్రాజెక్ట్ మేనేజర్ రమేశ్ 9959915182 నంబరును సంప్రదించాలని సూచించారు.

రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
ఆత్మకూరు : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రైతు భరోసాకు రెండుసార్లు ఎగనామం పెట్టిందని ఆరోపించారు. రైతుబీమా, రుణమాఫీని తుంగలో తొక్కిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి
కమలాపూర్ : మానవాళికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని మర్రిపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు.

కత్తిమీద ‘సాగు’

● ముఖం చాటేసిన వరుణుడు
● వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
● వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు


నారుమడులు లేక వెలవెలబోతున్న పొలాలు


నీరు లేక ఎండిపోయిన చెరువు

ఐనవోలు : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు అవుతున్నా వరుణుడు ఆశించిన మేర కరుణించకపోవడంతో రైతులకు పంటసాగు సవాల్‌గా మారింది. దీంతో మండల వ్యాప్తంగా సాగుచేసిన పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. గతేడాది యాసంగి సీజన్‌లో భూగర్భ జలాలు అనూహ్యంగా అడుగంటడంతో అనేక మంది రైతుల పొలాలు ఎండిపోయాయి. ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలైనప్పటి నుంచి ఆశించిన మేర వర్షాలు కురవడం లేదు. ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాల కారణంగా మెట్ట పంటల రైతులు కాస్తంత ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోతే మెట్ట భూమిలో సాగుచేసే పంటలైన పత్తి, మొక్కొజొన్న కూడా దెబ్బతిని ఆశించిన మేర దిగుబడులు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం కురవకపోవడంతో మండలంలోని చెరువులు, కుంటల్లో నీళ్ల లేక దయనీయ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అయితే బోరు, బావుల కింద సాగు చేసే రైతులు మాత్రం నారుమడులు సిద్ధం చేసి వరినారు అలికారు. కొద్దిమంది రైతులు రోహిణి కార్తెలో నారు పోసుకోగా నారు సిద్ధమైంది. అయితే చెరువుల్లో, కుంటల్లో నీరు చేరితే బోరు, బావుల్లో నీరు పెరిగే అవకాశం ఉంటుందని వర్షాల కోసం ఎదురు చూస్తున్నామని మండలంలోని పలువురు రైతులు తెలిపారు.

అంతంత మాత్రంగానే బోర్లు

మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల్లో సుమారు 11 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ఇందులో సుమారు 70 శాతంకు పైగా వరిసాగు చెరువులు, కుంటలపై ఆధారపడి సాగవుతుంది. ఆశించిన మేర సాధారణ వర్షపాతం నమోదు కాకపోతే బోర్లు, బావుల్లో నీరు అంతంత మాత్రంగానే ఉండే అవకాశం ఉంది. ఇలా జరిగితే వరిసాగు కష్టంగా మారే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

17 గ్రామాల్లో 93 చెరువులు, కుంటలు

జూన్ నెలలో సమృద్ధిగా వర్షాలు కురిస్తే చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. కాగా జూన్ నెలలో మండలంలో 133.7 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కేవలం 60.6 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసినట్లు అధికారులు తెలిపారు. లోటు వర్షపాతం కారణంగా మండల వ్యాప్తంగా ఉన్న 93 చెరువులు, కుంటలు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి. వరిసాగులో చెరువుల, కుంటలతో పాటు ఆకేరు వాగు కూడా ప్రధాన భూమిక పోషిస్తుంది. భూగర్భ జలాలు అడుగంటుతుండగా సరైన వర్షాలు కురిసి వాగులు, వంకలు పొర్లితేనే వరిసాగు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

వర్షాలు కురుస్తేనే సాగు సాధ్యం

నాకు కొండపర్తి గ్రామంలోని ఊర చెరువుకింద మూడు ఎకరాలు, కొచ్చెరువు కింద ఎకరం పొలం ఉంది. చెరువుల్లోకి నీరు వస్తేనే పంట సాగయ్యేది. సాధారణంగా జూన్ నెలలో నారుమడి సిద్ధం చేసుకుని జూలైలో నాటు వేసేవాడిని. ఇప్పటి వరకు వర్షాలు కురవకపోవడంతో నారుమడి కూడా సిద్ధం చేయలేదు.

- కంజర్ల సంపత్‌రావు, రైతు, కొండపర్తి

కౌలుకు తీసుకుని సన్నాల సాగు

రెండు ఎకరాల పొలం కదారి చెరువుకింద కౌలుకు తీసుకున్నాను. తినే బియ్యం కోసం సన్నధాన్యం సాగు చేశాను. నీటి వసతి లేకపోవడంతో చెరువు పారకం ద్వారానే సాగు చేస్తున్నాను. వర్షాలు లేక పోవడంతో నారుమడి సిద్ధం చేసుకోలేదు. వర్షాల కోసం ఎదురు చూస్తున్నాను. వర్షాలు పడకపోతే నష్టం తప్పేలా లేదు.

-బండి శ్రీనివాస్, రైతు, పంథిని

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కమలాపూర్ : 108, 102 సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని 108, 102 అంబులెన్సులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్సుల్లోని పరికరాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హనుమకొండ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్, పూర్వపు హనుమకొండ, ప్రస్తుత వరంగల్ జిల్లా మేనేజర్ లక్ష్మణ్, ఈఎంటీ బండ ఉపేందర్, పైలట్ సీహెచ్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న నసీరుద్దీన్

‘పంటల బీమా వెంటనే అమలు చేయాలి’


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : రైతుల రక్షణ కోసం పంటల బీమా అమలు చేసి వారి భద్రతకు తోడ్పాలని తెలంగాణ రైతు రక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కె.నారాయణను కలిసి వినతిపత్రం అందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు పంట బీమా అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట సాగు చేయడానికి రైతులు ఆర్థికంగా, మానసికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటబీమా అమలు చేసి రైతులకు భరోసా కల్పించాలన్నారు. ఇలాంటి సమయంలో పంట బీమా అమలు చేసి రైతు ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. ఆ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు, రవీందర్, రఘు, వీరస్వామి, రైతులు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి
● డాక్టర్ నాగరాజు

కమలాపూర్ : ఆడ, మగ అనే లింగ వివక్షను రూపుమాపాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసపై మహిళా సహాయక కమిటీ సభ్యులకు గురువారం మండల కేంద్రంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఉన్నత విద్య అవసరమని, ఉద్యోగాలు సాధించే వరకు చదివించాలని అన్నారు. ముఖ్యంగా ఆడ పిల్లలను వేధింపులకు గురి చేయవద్దన్నారు. అనంతరం పీఎన్‌డీటీ చట్టం, ఆరోగ్య సమస్యలు, లింగ ఆధారిత హింసపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారి నాగరాజును సిబ్బంది సన్మానించారు. మండల, హనుమకొండ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఏపీఎం నారాయణ, సర్వోదయ సీసీ శ్రీలత, ఎంఎస్ సృజన, సీసీలు కుమార్, మహేందర్, మమత, మౌనిక, సదాలక్ష్మి, శ్రీదేవి, శ్రీకాంత్, పుష్ప, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

శాయంపేట : చేనేత కార్మికులకు రూ.33 కోట్లు రుణమాఫీ పథకం కింద విడుదల చేసినందుకు గురువారం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో పీఏసీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం శంకర్‌లింగం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు రూ.33 కోట్ల రుణమాఫీ చేయడం సుభపరిణామం అన్నారు. చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు.

పురుగుమందుల సీజ్


బయో పురుగుమందులను సీజ్ చేసిన అధికారులు

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో గల మురళీకృష్ణ ఫెర్టిలైజర్స్ ఆండ్ పెస్టిసైడ్స్ షాపులో గురువారం శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్‌తో కలిసి ఏఓ గంగాజమున ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన బయో పురుగుమందులను గుర్తించినట్లు తెలిపారు. సుమారు రూ.19,410 విలువచేసే బయో మందులను సీజ్ చేసినట్లు చెప్పారు. బయో పురుగుమందులకు అనుమతి పొందనా ఫెర్టిలైజర్ షాపుల్లో నిల్వ చేయరాదని, అమ్మరాదని, రైతులు బయో పురుగుమందులు వాడడం వలన పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఎరువుల షాపు డీలర్లకు హెచ్చరించామని తెలిపారు.

ఇతర కట్టడాలకు అనుమతివ్వొద్దు


తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని బస్టాండ్ స్థలంలో ఇతర కట్టడాలకు అనుమతి ఇవ్వొద్దని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు సాంబయ్య మాట్లాడుతూ.. 1955లో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.3లక్షల సొంత డబ్బుతో బస్టాండ్ నిర్మించామని, 2023లో రోడ్డు వెడల్పులో భాగంగా బస్టాండ్‌ను తొలగించాలని అప్పటి అధికారులు, ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు. తాము భవిష్యత్‌లో ఈ స్థలంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని తెలుపడంతో అనుమతిస్తామని అప్పటి అధికారులు, ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు. దీంతో బస్టాండ్ తొలగించామని వినతిలో పేర్కొన్నారు. ఆ స్థలంలో ఇతర కట్టడాలకు అనుమతులు ఇవ్వొద్దని కోరారు. ఆ సంఘం నాయకులు వడ్డెపల్లి శ్రీనివాస్, బూర లక్ష్మీనారాయణ, తుమ్మ ప్రభాకర్, మామిడి మారుతి, బాసాని లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘ఇసుక రవాణాకు అధిక వసూళ్లు’


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇసుక సరఫరాకు అధిక డబ్బులు వసూల్ చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. అనంతరం బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుమన్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు దేవయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పిందని గుర్తుచేశారు. కానీ ఇసుక రవాణా చేసే వారు రవాణా చార్జీల పేరిట అధికంగా డబ్బులు వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం
● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర : వాతావరణ కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో మొక్కలు విరివిగా నాటి కాలుష్యాన్ని నివారించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలానీబాబా దర్గలో గురువారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన వాయువు చెట్ల ద్వారానే సాధ్యమని అన్నారు. వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై గ్రామాలను హరిత వనాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందు దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్‌తో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తహసీల్దార్ జ్యోతివలక్ష్మీదేవి, ఎంపీడీఓ కల్పన, ఎస్సై కొంక అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పొలెపాక శ్రీనివాస్, నాయకులు భిక్షపతి, పోశాలు, శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాధాకృష్ణ, రాజేశ్, యుగేందర్, మోయిన్, కొమ్మాలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి
● నోడల్ అధికారి శ్రీనివాస్


చెక్కు అందజేస్తున్న నోడల్ అధికారి శ్రీనివాస్

ధర్మసాగర్ : తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని బ్యాంకు నోడల్ అధికారి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని టీజీబీ ఆధ్వర్యంలో గురువారం జన సురక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జన సురక్ష అవగాహన కార్యక్రమం సెప్టెంబర్30 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బ్యాంకులో ఖాతా లేనివారు పీఎం జన్‌ధన్ యోజన, జీరో ఖాతా తీసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు అందించే సేవలను వివరించారు. సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఎవరికీ ఓటీపీ, సీవీవీ ఏటీఎం నంబర్లు చెప్పొద్దన్నారు. అనంతరం గతంలో జీవన జ్యోతి బీమా చేసుకుని మరణించిన ఖాతాదారుడి నామినికీ రూ. 2 లక్షల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్ కుమార్, బ్యాంకు మేనేజర్ వాజీదా, ఫీల్డ్ ఆఫీసర్ భరత్ కుమార్, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఆర్పీ కవిత

దామెర : జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ బృందానికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని ఎస్‌టీఎం అజయ్, ఎస్‌ఆర్పీ కవిత కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ బృందానికి అందించారు. అనంతరం బృందం ప్రతినిధులు మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. త్వరలో గ్రామ సభల షెడ్యూల్ విడుదల చేస్తామని స్పష్టం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో సభలు ఏర్పాటుచేసి చివరగా మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహిస్తామని అన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలకు గ్రామస్తులు హాజరు కావాలని కోరారు. తనిఖీ బృందానికి సహకరించి తగిన రికార్డులు అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కారకులపై చర్య తీసుకుంటాం
● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల : చదువులో ముందుండే పదో తరగతి విద్యార్థిని శ్రీవాణి ఆత్మహత్య చేసుకోవడం కలిచివేసిందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి విచారణ వ్యక్తం చేశారు. బాలిక ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గురువారం మల్లక్‌పేట సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. బాలిక ఆత్మహత్యకు కారణాలపై ప్రిన్సిపాల్ కృష్ణకుమారిని అడిగితెలుసుకోవడంతో పాటు బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థిని శ్రీవాణి ఆత్మహత్యపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మంచి పేరున్నా గురుకులంలో బాలిక ఆత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దని అన్నారు. ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, ఏసీపీ సతీష్‌బాబు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భారతదేశ ప్రజలు గర్వించదగిన విషయం

ఏఐసీసీ అధ్యక్షుడు గ్రామ కార్యకర్తలతో సమావేశం కావడం దేశంలోనే మొదటిసారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల, నడికూడ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. నేడు (శుక్రవారం) దేశంలో మొదటిసారిగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరుకానున్న సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి
● ఎంపీడీఓ గుండె బాబు


వైద్య పరీక్షలు చేసుకుంటున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండలంలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించి సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని, రక్త, మూత్ర పరీక్షలతో పాటు ఈసీజీ, ఎక్స్‌రే వంటి అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు ఉన్నాయన్నారు. అన్ని రకాల జబ్బులకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉన్నారని, మండల ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దన్నారు. గైనకాలజిస్టు ప్రతి సోమ, శుక్రవారం అందుబాటులో ఉంటారని, మహిళలు ఈ సేవలు వినియోగించుకోవాలని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలు సైతం వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. అనంతరం ఎంపీడీఓ అక్కడే వైద్య పరీక్షలు చేసుకున్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ చందు, కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌గౌడ్, వైద్య సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.